పెళ్ళి - వ్యవహారం

ఇంటికి చేరే సమయానికి సులోచన దడ ఇంకా సాంతం పోలేదు. ఆమె పాదాలూ, మోకాళ్ళూ ఇంకా బలహీనంగానే ఉన్నాయి. చేతుల తిమ్మిరలు పోతూ వస్తూ ఉన్నాయి. తనను చూసి ఎంతమంది ఏమనుకున్నారో ఊహించుకోవటానికి కూడా ఆమెకు ధైర్యం చాలలేదు. మొట్టమొదటిసారిగా ఆడది దొంగతనమో, వ్యభిచారమో, తాగటమో చేస్తే తనకున్న స్థితి ఉంటుందా అని ఆమె ఆశ్చర్యపడింది.

కాని తాను ఇంతటి ఉద్రేకానికి గురికావడం సులోచనను మరింత ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే తాను చేసిందల్లా జగన్నాథంతో ఒక గంటసేపు "వ్యవహారం" మాట్లాడింది - అంతకంటె ఏమీచెయ్యలేదు.

తనను ఒంటరిదాన్ని చేసి జగన్నాథం ఏమీ చెయ్యలేదు. చేసినా తాను పెద్దగా అల్లరిచేసి ఉండేది కాదేమో. ఏమంటే, తనను ప్రేమించితే బాగానే ఉంటుంది అని సులోచన అనుకున్న కొద్దిమంది యువకులలో జగన్నాథం ఒకడు. మనిషి అందంగా ఉంటాడు. ఇరవై ఎనిమిదో ఏడు నడుస్తున్నది; తన ఇరవై రెండేళ్ళకు ఈడయినవాడు. చక్కగా 'బర్మాషెల్'లో నాలుగు వందలు తెచ్చుకుంటున్నాడు. పెళ్ళి కాలేదు -

జగన్నాథానికి పెళ్ళి కాలేదన్నమాట జ్ఞాపకం వచ్చినప్పుడల్లా సులోచన హృదయాన్ని శూలాలతో పొడిచినట్టుగా ఉండేది. ఎందుకంటే - సులోచనకు పెళ్ళి అయింది!

అది చాలా పాపిష్టి పెళ్ళి - సులోచన జీవితానికి దేవుడు పెట్టిన పెద్దవాత.

సులోచన ఇంటరు పరీక్షకు కూర్చున్న కొద్ది రోజులకే జరిగిందా పెళ్ళి. అప్పటికి సులోచన తండ్రి బతికి ఉన్నాడు. ఆయన జీవించి ఉండగా వాళ్ళ ఇల్లు సాంఘిక, అభ్యుదయ భావాలకు కేంద్రంగా ఉండేది. ఆయన మిత్రవర్గంలో హరిజనులు మొదలుకొని మహాకవుల దాకా అన్ని రకాల వాళ్ళూ, హోదాలవాళ్ళూ ఉండేవారు. సులోచన తండ్రికి ఉన్న హోదా అది ఒక్కటే. ఆయనకు ఏనాడూ పెద్దరాబడిలేదు, తీరని దారిద్ర్యమూలేదు. అందరూ ఆయనకు ఆర్థిక సహాయం చేశారు. కాని ఆయన ఎవరికీ రుణపడవలసి రాలేదు.

వాళ్ళ ఇంటికి వచ్చే గొప్పవాళ్ళవెంట వారి బంధువులు కూడా వచ్చేవారు. కనీసం వెంకటరత్నం ఆ విధంగా వచ్చాడు. అతని మేనమామ పేరుమోసిన కవీ, సంస్కర్తా.

ఆయన పట్నం వస్తే సులోచనవాళ్ళ ఇంటికి విధిగా వచ్చేవాడు. ఆయన పట్నంలో ఉన్నన్నాళ్ళూ వెంకటరత్నం విధిగా - కాలేజీ ఎగగొట్టి అయినాసరే - ఆయన తోకలాగా తిరిగేవాడు.

ఏమైతేనేం, సంస్కృతి ధూపంతో నిషా ఎక్కి ఉన్న స్థితిలో వెంకటరత్నానికి సులోచనను పెళ్ళాడాలనీ, ఆమె తండ్రిగారికి అల్లుడు కావాలనీ ఆపుకోరాని కోరిక. తన తండ్రితో అని చూశాడు. యాభై వేల ఆస్తిపరుడూ, ఒకే కొడుకు గల ఆ పెద్దమనిషి హరిజనోద్ధరణ చేసే దరిద్రుల పిల్లను చేసుకోవటానికి సుతరాము ఒప్పుకోలేదు. తన బావమరిది సంఘోద్ధరణ చేసి బొత్తిగా శీలాన్ని నాశనం చేసుకున్నాడని ఆయన విశ్వాసం.

ఆ పరిస్థితిలో వెంకటరత్నం తండ్రిని వెర్రికుట్టె కింద కట్టేసి, ఒంటిగా వచ్చి సులోచనను పెళ్ళి చేసుకున్నాడు. మైనారిటీ తీరిన ప్రతివాడూ తాను చేసే ప్రతి పనికీ బాధ్యుడని చట్టం విశ్వసించినట్టే సులోచన తండ్రి కూడా విశ్వసించాడు.

తాను చేసినది పెద్ద పొరపాటని వెంకటరత్నం చేత ఒప్పించటానికి అతని తండ్రికి గట్టిగా నాలుగుగంటలు పట్టలేదు.

సులోచన తండ్రిపోకముందే ఆమె వివాహబంధం తెగిపోయింది. ఆయన పోయినాక సులోచన అన్న రమణారావు బొత్తిగా అసహాయుడైనాడు. అతని తండ్రి గారి మిత్రులు అతనికో వందరూపాయల ఉద్యోగం ఇప్పించగలిగారు. అతనికీ భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సులోచన భారం అదనపుభారం అతనికి. కాని పళ్ళబిగువున ఆ భారాన్ని కూడా మోస్తూ వస్తున్నాడు.

తన పెళ్ళి ఇట్లా పరిణమించటం మాట అటుంచి తండ్రిపోయినాక జీవితం గురించి సులోచన చాలా తెలుసుకుంది. తన తండ్రి ఎట్లా సృష్టించాడో కాని తన చుట్టూ ఒక కృత్రిమ వాతావరణం సృష్టించాడు. ఆ వాతావరణంలో అణా పైసలకన్న ఆదర్శాలకు విలవహెచ్చు. ఆయన పోగానే వాస్తవ జీవితం యొక్క నగ్న స్వరూపం సులోచనకు కనబడింది. అందులో మత విద్వేషాలన్నీ ఉన్నాయి. అందరినీ, అన్నిటినీ డబ్బే శాసిస్తున్నది. దీనిలో తభావతు అణుమాత్రం కూడా లేదు.

తన పెళ్ళి విషయం కూడా మొదటిసారి నిజం గ్రహించి ఆమె నీరసించిపోయింది. ఆ వెంకటరత్నం తనను ప్రేమించి పెళ్ళాడలేదు. ఒక ఆదర్శంకోసమూ పెళ్ళాడలేదు. ఏదో తాత్కాలికమైన ఆవేశాలు, విప్లవం చేస్తున్నాననే భ్రమలో, ఆవేశపరులు తమశక్తి సామర్థ్యాలు అంచనా కట్టుకోకుండా రాజకీయోద్యమాలలోకి దూకినట్టుగా తనను పెళ్ళాడేశాడు. ఆ తరవాత, నీటిలో మునిగిపోయేవాణ్ణి ఎవరో బయటికి లాగినట్టుగా

అతన్ని తండ్రి ఉద్ధరించాడు. "బతుకుజీవుడా!" అనుకుని అతను పెళ్ళి నుంచి బయటపడ్డాడు.

బయటపడ్డాడా లేదా అన్న విషయం ఎవరికి తోచినట్టుగా వారు చెప్పారు.

వాడెక్కడికి పోతాడు? కట్టుకున్న పెళ్ళాన్ని చచ్చినట్టు ఏలుకోవాలి! కోర్టుకు యీడుస్తేనే రోగం వదులుతుంది....! కోర్టుకు పోతే మాత్రం ఏముంది? అతుకు అతుకే! అసలు ఉన్నవాళ్ళకు, లేనివాళ్ళకు పొత్తుకుదరదులే! మనోవర్తి రాబట్టండి!.... ఇంకా కొన్ని ఏళ్ళు గడిస్తే విడాకులు పుచ్చుకోవచ్చు – ఈ పెళ్ళాన్ని వదిలేసి వాడు మళ్ళా పెళ్ళాడాడా? ఎన్ని గుండెలు? – అదంతా తీసిపెట్టు పిల్లమీద పిల్ల నివ్వటానికి సిద్ధంగా బోలెడంతమంది ఉన్నారు!–

ఇటువంటి విజ్ఞానమంతా వింటుంటే సులోచనకు బుర్ర గిర్రున తిరిగిపోయేది. ఇవన్నీ వట్టి ప్రగల్భాలు. మనుషుల వాక్చాతుర్యానికీ జీవించవలసిన జీవితానికీ ఏమీ సంబంధంలేదు.

సులోచన ఆ వెంకటరత్నం కోసం ఒక్క చిన్న నిట్టూర్పు కూడా విడవలేదు. వాళ్ళిద్దరూ ఎన్నడూ అయిదు నిమిషాలు బాతాఖానీ కూడా కొట్టిన పాపానపోలేదు. ఒక్కొక్కసారి ఆమెకు ఈ జరిగినదంతా తనకు సంబంధించిన విషయం కానేకాదని కూడా భ్రమ కలిగేది –

కాని అన్న రమణారావు పైకి ఏమీ అనకపోయినా తన భారాన్ని తగ్గించుకోవటానికి ఏవేవో ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసినప్పటినుంచీ ఇది తన సమస్యేనన్న భావం ఆమెలో నిజంగా రూపొందసాగింది.

తన చెల్లెలికి తెలియకుండా రమణారావు ఆమె అత్తవారితో చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. అతను మెతకమనిషి, దేబిరింపు ఉత్తరాలు రాసి ఉండవచ్చునని సులోచన అనుకున్నది. సులోచన పెద్ద 'దార్ఢ్యంగల' మనిషి అనికాదు. కాని 'వాళ్ళ' దగ్గిరనుంచి వచ్చిన జవాబులు ఒకటి రెండు ఆమె కంట పడ్డప్పుడు ఆమెకు తన అన్నపైన ఎంతో జాలికలిగింది..... "ఈ పెళ్ళి సవ్యంగా జరగలేదు. .... మీరు మీ చెల్లెలిని తార్చి మావాణ్ణి ఈ పెళ్ళికి ఒప్పించారని నాకు సందేహంగా ఉన్నది!–" ఇటువంటి హేయమైన ఆపాదనలు ఆ ఉత్తరాలలో ఉన్నాయి.

రమణారావు కనీసం మనోవర్తి అయినా సంపాదించటానికి ప్రయత్నించి విఫలుడయినాడు! అతని మెతకదనం వాళ్ళు బాగా అర్థం చేసుకున్నారు.

సులోచన మాత్రం ఏం చేస్తుంది! "మనకు హక్కులున్నై – కోర్టుకెక్కు!" అని

అన్నతో ఎట్లా అంటుంది? ఒకవంక నలుగురూ రెండుపూటలా తిండి తినటమే ఎంతో కష్టంగా ఉంటే!–

ఒకరోజు ఏదో మాటల సందర్భంలో రమణారావు ఆడవాళ్ళు అంతో ఇంతో సంపాదించడం బుద్ధిగలపని అని ఇంట్లో గట్టిగా వాదించాడు. అది తనను మనసులో పెట్టుకునే అన్నమాట అని సులోచనకు ఎన్నో రోజులకు గాని తట్టనైనాలేదు. తట్టినాక తన మందమతిని తలుచుకొని ఆమె కుంగిపోయింది. ఆ సంగతి ఎప్పుడు జ్ఞాపకం వచ్చినా ఆమెకు ఎంతో బాధ కలిగేది.

సులోచన తనంతట తనకే తట్టినట్టుగా ఒకనాడు అన్నతో, "నాకు ఏదన్నా చిన్న ఉద్యోగం చెయ్యాలని ఉన్నది!" అన్నది.

రమణారావు తనకూ ఆ ఆలోచన అదివరకు రానట్టుగా "చేస్తే చెయ్యనూ వచ్చు!" అన్నాడు.

❀ ❀ ❀ ❀ ❀

సులోచన సంపాదించిన మొదటి చిన్న ఉద్యోగంలోనే ఆమెకు మాణిక్యంతో పరిచయమయింది. ఆమెది మంచి ఉద్యోగమే. ఆమె బియ్యే పాసయింది.

జగన్నాథం మాణిక్యం అన్న.

సులోచన చిన్నతనం నుంచి కూడా మగవాళ్ళలో బాహ్యాకర్షణ కన్న వాళ్ళు తన గౌరవాన్ని సంపాదించగలవాళ్ళా కాదా అన్నది ప్రధానంగా ఉండేది. మనిషి ఎంత అందంగా ఉన్నా వాళ్ళలో కించిత్తు వెకిలితనం ఉంటే ఆమె సహించలేక పోయేది.

మొదట్లో "ఓహో!" అంటే "ఓహో!" అంటూ వచ్చిన మాణిక్యం ఒకనాడు అకస్మాత్తుగా సులోచనతో గాఢస్నేహం ప్రారంభించింది. వాళ్ళిద్దరూ కలిసి సినిమాలకూ, బీచికీ షికార్లు తిరగసాగారు. ఎప్పుడన్నా జగన్నాథం వాళ్ళకు తన కారులో లిఫ్టు ఇచ్చేవాడు కాని అతను పనిపెట్టుకుని ఎన్నడూ సులోచనను పలకరించిన పాపాన కూడా పోలేదు.

మాణిక్యం మటుకు సులోచనను గురించి తెలుసుకోదగిన విషయాలన్నీ రాబట్టింది. అదంతా ఎప్పటికప్పుడు జగన్నాథానికి రిపోర్టవుతున్నదని ఆమె ఊహించలేదు.

ఒకనాడు సులోచన పుట్టినరోజు – ఆమెకు పుట్టినరోజు పండగలంటూ లేవు – జగన్నాథమూ, అతని చెల్లెలూ కారులో సులోచనను ఎక్కించుకుని మౌంట్ రోడ్డులో సింధీ బట్టలషాపుకు ఒకదానికి వెళ్ళి అవీ ఇవీ కొనిపెట్టారు. ఒక వీశెడు మిఠాయికూడా కొనిపెట్టారు.

వాటిని ఎట్లా నిరాకరించాలో కూడా సులోచనకు తెలియలేదు. ఆమె తన

అసహాయస్థితిని తలుచుకుని కంటతడి పెట్టుకున్నది. ఆ క్షణంలో జగన్నాథం తన కేసి చూస్తూండటం గమనించి ఆమె ఎంతో అవమానపడింది.

అది ఆమె ఇరవై మూడో పుట్టినరోజు.

ఇదే తన జీవితంలో ఒక విచిత్రానుభవం అనుకుంటున్న సులోచనకు ఇవాళ అంతకు వెయ్యింతలు అపూర్వమైన అనుభవం అయింది.

అసలు ఈ అనుభవం మరే ఆడదానికన్నా అవుతుందా అని కూడా ఆమె ఆశ్చర్యపడింది.

ఆవేళ ఆదివారం. ఉదయం పదిగంటలవేళ మాణిక్యం కారులో వచ్చి సులోచనను తమ ఇంటికి భోజనానికి రమ్మన్నది.

"మా అన్న నీతో ఏదో బిజినెస్ మాట్లాడాలన్నాడు. నీకేమన్నా అభ్యంతరమా?" అని దారిలో ఆమె సులోచనను అడిగింది.

"బిజినెస్" అన్నమాట సులోచనకు కాళ్ళజెర్రిలాగా గగుర్పాటు కలిగించింది. బిజినెస్ అంటే వ్యాపారమో, వ్యవహారమో కావాలి. తనతో ఆ జగన్నాథానికి అటువంటిదేమీ ఉండే అవకాశం లేదు. అందుచేత ఆ ముక్క మరొక అవాచ్యమైనదానికి పర్యాయపదంగా మాణిక్యం వాడి ఉండాలి. కాని మాణిక్యం అలా మాట్లాడే వెకిలి మనిషి కాదు.

"బిజినెసా? నాతోనా?" అన్నది సులోచన రాని నవ్వు తెచ్చుకుంటూ.

"అది మా జగన్నాథం అన్నమాటే అతను సాధారణంగా ఒక మాటకు ఒకమాట అనడు!" అన్నది మాణిక్యం.

మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనాలదగ్గిర జగన్నాథం సులోచనకు కనిపించాడు. అతను మామూలుగానే మాట్లాడాడు. ఆ తరువాత అతను సాయంకాలం అయిదు గంటలదాకా కనిపించనేలేదు. అతని "బిజినెస్" మాటే మరిచిపోయింది సులోచన.

అయిదు గంటలకు మళ్ళీ అతను వచ్చి బీచిమీదుగా షికారు పోదామన్నాడు. కారు వెనుక సీటులో ఆడవాళ్ళిద్దరూ కూచున్నారు. కారు నేరుగా అడయారు బీచికి వెళ్ళింది.

కారు ఒకచోట ఆపి జగన్నాథం సులోచనతో, "ఒక చిన్న వ్యవహారం మాట్లాడాలి. మా సిస్టర్ కారులోనే ఉంటుంది. మనం అట్లా నడిచివద్దామా?" అన్నాడు.

సులోచన నిర్భయంగా అతనివెంట నడవసాగింది. దడా, వణుకూ ఏమీ లేదు.

"నీసంగతంతా మా సిస్టర్ చెప్పింది. నీ జీవిత సమస్యను గురించి ఆలోచించాను. అది పరిష్కారంకాని సమస్యకాదు. కాని ఎట్లా పరిష్కరించినా ఏవో చిక్కులు కొత్తవి రాక తప్పదు.

"నేనొక పరిష్కారమార్గం సూచిస్తాను. నీకిష్టమైతే దానిని వ్యవహారరీత్యా అమలు చేసుకోవచ్చు. మన ఇద్దరమూ భార్యాభర్తలుగా ఉందామని నేను సూచించబోతున్నాను.

"అది చట్టరీత్యా సాధ్యం కాదు. చట్టరీత్యా మనం భార్యాభర్తల మవుదామని నేను సూచించటం లేదు. భార్యాభర్త మధ్య ఇంకొకరకం బంధం ప్రేమబంధం. మనం ఒకరినొకరు ప్రేమించాలని కూడా నేను సూచించటంలేదు.

"నిజం చెప్పాలంటే నాకు ప్రేమ అంటే చెడ్డభయం. నా స్నేహితుడొకడు ప్రేమించి పెండ్లాడాడు. ప్రేమకు మంచువిచ్చినట్టు విచ్చిపోయే దురభ్యాసం ఉంది. ఈ ప్రేమ ఎప్పుడు ఏ బలి కోరుతుందో ఎవరూ చెప్పలేరు. కొన్ని త్యాగాలు చేసి నా స్నేహితుడిలాగా ప్రేమను చెడతిట్టేకన్న, దాన్ని నమ్ముకోకుండా ఉండటమే నాకు మేలని తోస్తుంది.

"నాకు శాస్త్రోక్తమైన మతవివాహాలన్నా కూడా భయమే. అది మనుషుల స్వేచ్ఛను హరించటం అట్లా ఉంచి ఇంకొక ప్రతిఫలం ఇవ్వదు.

"మొత్తంమీద నాకు ఏ రకం పెళ్ళిలోనూ నమ్మకం లేదని స్పష్టం చేశానుగద. అయితే నాక్కూడా అందరిలాగే ఒక స్త్రీతో సుఖంగా ఉండాలనీ, ఆమెతో కష్టసుఖాలు పంచుకోవాలనీ, పిల్లలను కనాలనీ లేకపోలేదు. అయినా వాటికోసం రొచ్చులో దిగలేక ఇంతకాలంగా పెళ్ళిని వాయిదా వేస్తూ వచ్చాను.

"కాని నిన్ను గురించి ఆలోచిస్తుండగా ఒక మంచి పద్ధతి తోచింది – పెళ్ళి ఒక వ్యాపార బంధంగా ఎందుకు చేసుకోరాదు? ఈ వ్యాపారంలో ఇద్దరికీ సమాన హక్కులు ఉన్నంతకాలం ఒకరినొకరు గౌరవించుకోవటం జరుగుతుంది. ఒకరివల్ల ఒకరికి ఆర్థికంగా నష్టం కలగకుండా ముందే తగిన కట్టుదిట్టాలు చేసుకోవచ్చు!"

"అది ఎట్లా?" అన్నది సులోచన అడ్డొచ్చి.

"మన ఇద్దరమూ పెళ్ళాడే పక్షాన నేను నీకు నెలకింత ఇస్తానని ముందే రాసి ఇస్తాను. పిల్లలు పుట్టినప్పుడల్లా వాళ్ళకు కొంత డబ్బు ప్రత్యేకంగా ఇస్తాను."

సులోచన నవ్వి, "వెనక డబ్బుగలవాళ్ళు ఎవరినన్నా ఉంచుకుంటే ఇటువంటి ఏర్పాట్లే చేసుకునేవారేమో" అన్నది.

"ఆ మాట కొంతవరకు నిజమే అనుకుంటాను. కాని ఒకరు ఒక మనిషిని ఉంచుకోవటంలో కొంత వ్యామోహం ఉండేది. దాన్ని ఆధారం చేసుకుని ఉంపుడుగత్తె తన విటుణ్ణి సాధ్యమైనంత శీఘ్రంగా దివాలా ఎత్తించేసేది."

సులోచన కాస్త ఆలోచించి, "ఈ వ్యామోహం సమస్య ఎప్పుడూ ఉండనే ఉంటుందేమో! అసూయ కూడానూ? బిజినెస్ పెళ్ళి చేసుకున్న జంటలో ఏ ఒకరికి

పరాయి మనుషులపైన వ్యామోహం పుట్టినా బిజినెస్ దివాలా ఎత్తేస్తుంది గద! దానివెంట అసూయలూ, కక్షలూ, కొట్లాటలూ...!" అన్నది.

"అటువంటివి దాటగలిగిన సంస్కారం వున్నవాళ్ళకే ఈ రకం పెళ్ళి సాధ్యమవుతుందనుకుంటాను" అన్నాడు జగన్నాథం.

అతని జుట్టు అకస్మాత్తుగా సులోచన చేతిలో చిక్కినట్టయింది. ఆమె అతన్ని అతి నిశితమైన ప్రశ్నలు వెయ్యసాగింది. "ప్రపంచంలో అందరూ ఈ బిజినెస్ పెళ్ళిచేసుకునే అవకాశం ఉందా ? అందరూ అసూయనూ, ప్రేమనూ అధిగమించేదాకా ఇలాంటి పెళ్ళిళ్ళు వాయిదా పడాలా? ఇప్పుడున్న పెళ్ళిళ్ళు ఎంత ఘోరంగా పరిణమిస్తున్నాయో, ఈ బిజినెస్ పెళ్ళిళ్ళు కూడా అంత ఘోరంగాను పరిణమించే అవకాశాలున్నాయా, లేవా? ఈ పెళ్ళిళ్ళలో ఉన్న ఒక్క గొప్పదనమూ డబ్బు ఏర్పాట్లు చేసుకోవటంలోనే కదా ఉన్నది? పెళ్ళానికి నెలకు పదిరూపాయలైనా ఇవ్వలేనివాడు ఈ వ్యాపారం ఎట్లా చేస్తాడు? ఇవి అచ్చగా ధనికులు మాత్రమే చేసుకునే పెళ్ళిళ్ళేనా?"

ఈ ప్రశ్నలు కొరడా దెబ్బల్లాగా తగిలాయి జగన్నాథానికి. అతను రోషంతో "పెళ్ళానికి ఒక్కపూట తిండి పెట్టలేనివాడు పెళ్ళి ఎందుకు చేసుకోవాలి? మొగుడు లక్షాధికారి అయి ఉండి కూడా తన పెళ్ళాం స్వేచ్ఛగా ఖర్చు చేసేటందుకు రూపాయి ఇవ్వని నిర్భాగ్యులున్నారు. వారి పెళ్ళిళ్ళు సవ్యంగా ఉంటే నేను చెప్పే పెళ్ళి అంతకన్న వెయ్యిరెట్లు మంచిది కాదా? మొగుడూ పెళ్ళాలు మతం పేరనో, ప్రేమ పేరనో ఒకరికొకరు అతీతంగా తమ సంబంధాలు ఏర్పాటు చేసుకోవటం మంచిది కదా? అన్నిటికన్న ముఖ్యం, ఈ పెళ్ళి ఎప్పుడు ఎవరు రద్దుచేసుకోవాలన్నా ఎవరికీ బాధగాని, నష్టంగాని ఉండదే! విడాకులంటే వెయ్యిరెట్లు తేలిక; ఇది నాగరికమైన వివాహం ఎందుకు కాదు?" అన్నాడు.

"మధ్యలో ప్రేమలూ, అసూయలూవస్తే ఏం చెయ్యాలో నాకు అర్థం కాలేదు."

"మామూలు పెళ్ళిళ్ళకు ఈ ఇబ్బంది లేదా? ప్రేమలూ, అసూయలూ స్వయంకృతాపరాధాలు కావా?" అన్నాడు జగన్నాథం.

ఇంతసేపూ ఇదంతా లోకవ్యవహారం అన్నట్టు మాటలాడుతున్న సులోచనకు ఇది తనకు సంబంధించిన వ్యవహారమేనని అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చి కొద్దిగా దడపుట్టింది.

ఇద్దరూ కాస్సేపు మౌనంగా ఉన్న తరవాత అతను, "ఏం, సులోచనా ఏమంటావు?" అన్నాడు.

"ఈ పెళ్ళికి నన్నే ఎందుకు ఏరుకున్నారు?" అన్నది సులోచన నిబ్బరంగానే.

"దీనికి రెండు కారణాలున్నాయనుకుంటాను. ఒకటి, ఇటువంటి పెళ్ళి నీతో సాధ్యమైనట్టుగా మరొక పెళ్ళిగానిపిల్లతో సాధ్యంకాదు. అటువంటి కన్య చట్టరీత్యా వివాహం

కోరుతుంది.... అంటే, మనిద్దరమూ ఏ ఇతర కారణంచేతనైనా పెళ్ళాడదలిస్తే నేను చెప్పిన బిజినెస్ పెళ్ళి తప్ప మరొక పద్ధతిలేదు."

"ఇతర కారణాలంటే?"

"అది నా రెండో కారణం. నీ అసహాయస్థితిని చూస్తే నా కెందుకో పట్టరాని ఆగ్రహం కలుగుతున్నది. నీకు ఇంత అన్యాయం జరిగిపోయింది. కాని ఎవరూ నీకు ఏమీ చెయ్యకుండా ఉన్నారు. ఈ సంగతి తలుచుకుంటే ఒక్కోసారి నాకు నిద్రకూడా పట్టదు" అన్నాడు జగన్నాథం.

చాలాసేపు సులోచన ఏమీ అనకపోవటం చూసి అతను, "తొందరలేదు సులోచనా! ఆలోచించు. ఇదుగో ఈ కాగితం నీ దగ్గిర ఉంచుకో. ఇందులో మన పెళ్ళికి నిబంధనలన్నీ రాసి సంతకం పెట్టాను. నీకు నమ్మకం కాకపోతే దాన్ని చించిపారెయ్యి. తాపీగా చదువుకుని ఏ విషయమూ మా సిస్టర్‌తో చెప్పు. లేకపోతే నాతోనే–" అన్నాడు.

అతను చాచిన చెయ్యి ఆమె కొంతసేపు చూడనేలేదు. కాగితం విప్పి చూసింది. కాని ఆమె కళ్ళకు ఒక్క అక్షరం కనిపించలేదు.

"షేక్ హాండ్స్!" అన్నాడతను.

సులోచన తన చెయ్యి ఇచ్చింది. బిజినెస్!

ఇద్దరూ కారుదగ్గిరికి నడిచివచ్చారు.

సులోచన్నూ మాణిక్యాన్నీ ఇంటిదగ్గిర దిగబెట్టి జగన్నాథం కారులో వెళ్ళాడు.

"ఇంటికి పోదువుగానిలే, మంచి ఘాటైన కాఫీ ఇస్తాను, లోపలికి రా!" అన్నది మాణిక్యం.

ఇద్దరూ లోపలికివెళ్ళాక, "ఏమయింది మీ బిజినెస్?" అని అడిగిందామె.

సులోచన తన హాండ్‌బాగ్‌లో నుంచి జగన్నాథం ఇచ్చిన కాగితం తీసి ఇచ్చింది.

మాణిక్యం దాన్ని పైకి చదివింది. ఆ పత్రంలో, సులోచన అతని భాగస్వామినిగా ఉండేటట్టూ అందుకు గాను అతను నెలనెలా రెండువందలు ఇచ్చేటట్టూ, ఆమెకు పిల్లలు కలిగితే ప్రతిబిడ్డకూ అయిదేసివేల బీమా ఏర్పాటు చేసేటట్టూ రాసి ఉన్నది.

అంతా చదివాక ఇద్దరూ ఒకరికేసి ఒకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

"ఫూల్! నీ మీద చాలా ప్రేమ ఉండి ఉండాలి!" అన్నది మాణిక్యం.

"అదెట్లా?" అన్నది సులోచన.

"నీమీద అభిమానమో, ప్రేమో లేకపోతే నీ ఆర్థిక హక్కులను ఇంతగా పాటించడు. అది రూలే!" అన్నది మాణిక్యం.

ఆ క్షణంలో సులోచనలో నిజమైన దడ ఆరంభమయింది. ఆమె కాఫీకోసం కూడా ఆగకుండా బయలుదేరి ఇంటికి వచ్చిపడింది.

జగన్నాథం చెప్పిన మిగతా విషయాలన్నీ ఎగిరిపోయాయి. అసలు సంగతేమంటే అతను తనను ప్రేమిస్తున్నాడు; తనతో వ్యభిచార జీవితం గడపమంటున్నాడు!

పరువైన ఆడది అటువంటిపని ఎట్టాచేస్తుంది?

అసంభవం! అసంభవం! ఇక తను వాళ్ళింటికి వెళ్ళలేదు; అతని మొహం చూడలేదు!

❁ ❁ ❁ ❁ ❁

"రమణారావుగారూ!"

రమణారావు వచ్చిన మనిషిని గుర్తుపట్టలేదు. ఆయనే తాను ఫలానాఅనీ, ఫలాని పనిమీద వచ్చానని చెప్పుకున్నాడు.

సులోచన మామగారు రాయబారిని పంపాడు. తన భర్త అయిన వెంకటరత్నం తిరిగి పెళ్ళాడితే తనకు సమ్మతమేనని సులోచన పత్రం రాసి, దానిపైన రమణారావూ, భార్యా సాక్షి సంతకాలు చేస్తే అయిదువేలిస్తారట! ఒకప్పుడు మనోవర్తి ఇవ్వకుండా ఉండటానికి గాను అన్ని రకాల అభాండాలూ వేసిన మనుషులే!

"పైకం వెంటపట్టుకొచ్చాను. మళ్ళీ అలా పనిచూసుకొని తొమ్మిదీ ఆ ఛాయల వస్తాను. ఎందుకొచ్చినపేచీ వాళ్ళకా కాగితం రాసి పారెయ్యండి. అమ్మాయి బ్రతుకెట్లాగూ పాడుకానే అయింది" అన్నాడు దూత.

ఆయన వెళ్ళిపోయాక రమణారావు సుముఖతగా ఆ డబ్బు తీసుకొని కాగితం రాసివ్వటమే మేలని అన్నాడు.

"ఏదో పెద్ద కట్నంతో సంబంధం వచ్చి ఉంటుంది! పదివేలు కక్కమన్నా కక్కుతారేమో!" అన్నది రమణారావు భార్య ఆశగా.

"ఊరికే రాసిమ్మన్నా రాసిస్తాను" అన్నది సులోచన.

"నీకు పుణ్యం ఉంటుంది! ఆ మాట ఆ మనిషి ఎదట అనకు!" అన్నాడు రమణారావు.

సులోచన నాటకం చూస్తున్నట్టుగా ఉన్నది.

దూత తొమ్మిది దాటగానే వచ్చాడు. అతగాడికి వేరే పని ఉన్నమాట అబద్ధమై ఉంటుంది. అయిదువేల ఎర, జీర్ణం కావటానికి టైమిచ్చాడు అంతే!

"అయిదువేలు మరీ తక్కువండీ! ఈ రోజుల్లో ఎకరం పొలం కూడా రాదు.

మనోవర్తికింద యిచ్చినా అయిదువేలకు మొత్తం కానప్పుడు పత్రం రాసివ్వాలంటే –" అని రమణారావు నసిగాడు.

"అయ్యా, ఇట్లా లిటిగేషను పెట్టి ఏమీ లాభం ఉండదు. అవతల ఆయన ఉద్దండుడు. కోడలు రంకు పోయిందని కూడా సాక్ష్యం తీసుకురాగలడు. తెగతెంపులే అనుకుని దీనికి ఒప్పుకోండీ! మీ మంచి కోరే చెబుతున్నాను!" అన్నాడు దూత.

"అధమం ఏడున్నర వేలైనా ఉంటే –"

బేరం సాగింది. అరగంట అయాక దూత మహాత్యాగం చేస్తున్న వాడల్లే, "అయ్యా, నా పూచీమీద ఇంకొక్క వెయ్యి తీసుకొని ఆ కాగితం రాయించి నా మొహాన పడెయ్యండీ! తెగేదాకా లాగటం మీకు భావ్యం కాదు. నాకూ భావ్యం కాదు; ఆ చేత్తోనే ఆ డబ్బుక్కూడా రశీదిప్పించండి!" అన్నాడు.

డబ్బూ, పత్రాలూ చేతులు మారాయి.

"డబ్బు ఏం చేస్తావ్?" అన్నాడు రమణారావు.

"నీ ఎక్కౌంటులో వేసి ఉంచు!" అని సులోచన ఒక్క నిట్టూర్పు విడిచింది.

ఆ సాయంకాలమే ఆమె జగన్నాథాన్ని వెతుక్కుంటూ వెళ్ళింది. మాణిక్యాన్ని కాఫీ తెమ్మని పంపి ఆమె జగన్నాథంతో "మీరానాడు అడిగిన ప్రశ్నకు సమాధానం తేల్చుకున్నాను!" అన్నది.

"ఏమిటది?" అన్నాడు జగన్నాథం ఉద్రేకం అణుచుకోలేకుండా.

సులోచన తన హాండ్‌బాగ్‌లో నుంచి అతను రాసి యిచ్చిన కాగితం తీసి అతనికి చూపించి, చించి ముక్కలు చేసింది.

జగన్నాథం ఇంతమొహం చేసుకుని, "హ్వాట్ పిటీ!" అన్నాడు.

"పిటీ ఏం? నేను ఒప్పుకుంటున్నాను!" అన్నది సులోచన.

ఒక్క గంతులో జగన్నాథం ఆమెను చేరి గట్టిగా వాటేసుకుని, "ఫూల్! ఫూల్!" అన్నాడు.

కాస్సేపటికి మాణిక్యం కాఫీ కప్పులతో వచ్చేసరికి సులోచనా, జగన్నాథమూ దర్బీ స్వీప్ గెలుచుకున్నవాళ్ళ మొహాలు పెట్టుకుని కూచుని ఉన్నారు.....

ముద్రణ :కొడవటిగంటి కుటుంబరావు కథలు, 1960 -63 మధ్య?

జయా పబ్లికేషన్స్, విజయవాడ